క్లుప్తంగా

నేడు అందుబాటులో నేదురుమల్లి

వెంకటగిరి(సైదాపురం): వెంకటగిరిలోని బంగళాలో బుధవారం మధ్యాహ్నం 3 గంటల 30 నిమిషాల నుండి వైఎస్ఆర్ సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి అందుబాటులో ఉంటారు. ఈ మేరకు నేదురుమల్లి కార్యాలయం ఒక ప్రకటనలో తెలియజేసింది.

పోలేరమ్మకు పొంగళ్లు



పోలేరమ్మ ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

ఓజిలి: ఓజిలి గ్రామంలో మంగళవారం పోలేరమ్మ అమ్మవారికి గ్రామస్తులు పొంగళ్లు పెట్టారు. గ్రామస్తులు పొంగళ్లు ఊరేగింపుగా అమ్మవారి ఆలయం తీసుకొచ్చి భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. పొంగళ్లను అమ్మవారిని నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. తొలుత ఉదయం గ్రామస్తులు అమ్మవారికి అంబళ్లు పోశారు. ఆలయాన్ని సుందరంగా విద్యుత్ దీపాలతో అలంకరించారు.

మండలానికి చేరిన పాఠ్య పుస్తకాలు



రాపూరులో పాఠ్య పుస్తకాలు పరిశీలిస్తున్న ఎంఈఓలు శ్రీనివాసులు, జిలానీ బాషా

రాపూరు: మండలంలోని 78 పాఠశాలలకు సంబంధించిన పాఠ్య పుస్తకాలు, నోటు పుస్తకాలు మండలానికి మంగళవారం చేరినట్లు మండల విద్యాశాఖాధికారులు శ్రీనివాసులు, జిలానీ బాషా తెలిపారు. మండలానికి 4,252 కిట్లు అవసరమని వాటిలో మొదటి విడతగా కొన్ని వచ్చినట్లు తెలిపారు. అలాగే 7వ తరగతి, 4వ తరగతి సంబంధించిన కొన్ని పుస్తకాలు రావాల్సి ఉందన్నారు. అన్ని పుస్తకాలు వచ్చిన వెంటనే ఆయా పాఠశాలల హెచ్‌ఎంలకు అందిస్తామని వివరించారు.

ఖనిజం అక్రమ తరలింపుపై చర్యలు



స్వాధీనం చేసుకున్న లారీ

సైదాపురం: అనుమతులు లేకుండా ఖనిజాన్ని తరలిస్తే చర్యలు తప్పవని జిల్లా విజిలెన్స్ మైనింగ్ అధికారి బాలాజీనాయక్ స్పష్టం చేశారు. సోమవారం రాత్రి మండలంలోని పలు గ్రామాల్లో అక్రమ త్రవ్వకాలపై ఆయన ముమ్మరంగా తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో తనిఖీలు చేస్తుండగా ఎలాంటి అనుమతి పత్రాలు లేకుండా రెండు లారీల్లో ఖనిజాన్ని తరలిస్తుండడంతో వాటిని స్వాధీనం చేసుకుని పోలీసులకు అప్పగించినట్లు జిల్లా విజిలెన్స్ మైనింగ్ అధికారి తెలిపారు.

అక్రమ మైనింగ్ చేస్తున్న వాహనాలు స్వాధీనం



తనిఖీలు చేస్తున్న ఉమ్మడి అధికారులు

సైదాపురం: మండలంలో మంగళవారం పోలీసులు, రెవెన్యూ, మైనింగ్ అధికారులంతా ఉమ్మడి తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో అనుమతులు లేకుండా అక్రమంగా మైనింగ్ చేస్తున్న ఓ మైన్‌లో మూడు హిటాచీ వాహనాలను స్వాధీనం చేసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం అనుమతులు లేకుండా ఇష్టానుసారంగా మైనింగ్ కార్యకలాపాలను నిర్వహిస్తే కఠినమైన చర్యలు తీసుకుంటామని వారు హెచ్చరించారు. తనిఖీల్లో తహశీల్దార్ ప్రవీణ్‌కుమార్, ఎస్ఐ విజయకుమార్, మైనింగ్ అధికారులు న్నారు.

మున్సిపల్ ఏఈగా చంద్రమోహన్



నాయుడుపేట టౌన్: నాయుడుపేట మున్సిపాలిటీ ఇంజినీరింగ్ విభాగం ఇన్‌చార్జ్‌గా ఏఈ చంద్రమోహన్‌ను నియమించినట్లు కమిషనర్ జనార్దన్‌రెడ్డి మంగళవారం వెల్లడించారు. సంబంధిత శాఖ ఉన్నతాధికారులు ఈ ఆదేశాలను జారీ చేసినట్లు తెలిపారు. ఏఈ అందుబాటులో ఉంటు పనులను పర్యవేక్షిస్తారన్నారు.

14న కౌన్సిల్ సమావేశం

వెంకటగిరి రూరల్: వెంకటగిరి మున్సిపాలిటీ పరిధిలోని 25 వార్డుల్లో నిర్వహించబోయే అభివృద్ధి పనులకు సంబంధించి ఈ నెల 14 మున్సిపల్ కౌన్సిల్ సమావేశం నిర్వహించనున్నట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ నక్కా భానుప్రియ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మున్సిపల్ కౌన్సిలర్లు విధిగా హాజరు కావాలని పిలుపునిచ్చారు.

విరగ్గాసిన బెండ మొక్కలు



పచ్చిమిర్చి కోస్తున్న కూలీలు



చూడచక్కని బంతి



ఏపుగా ఎదిగిన మొక్కజొన్న



కూరగాయల సాగు... లాభాలు బాగు

పచ్చని కూరగాయల మొక్కలు... ఆకుకూరల తోటల మధ్య ఆరుగాలం కష్టపడే రైతులు రోడ్డుకు ఇరువైపులా కనపడడం మండలంలో సర్వ సాధారణం. జాతీయ రహదారికి రెండు పక్కలా పంట పొలాలు, వ్యవసాయ భూములకు అత్యంత సమీపంలో స్వర్ణముఖినది ఉంది. దీంతో సాగునీటికి ఇబ్బంది లేదు. వేకువజామున నిద్రలేచిన రైతులు తలపాగా చుట్టుకొని, వ్యవసాయ పనిముట్లు చేతబట్టి, ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుంటూ వ్యవసాయ పొలాల్లోకి వెళ్లడం పరిపాటి. ఉదయం నుంచి సాయంత్రం దాకా కష్టపడి పనులు చేస్తారు. వంగ, బెండ, కాకర, బీర, సొర, టమాట, చిక్కుడు, ఉల్లిపాయలతోపాటు చిర్రాకు, గోంగూర, తోటాకు తదితర ఆకుకూరలు, మొక్కజొన్న, పచ్చిమిర్చి, నిమ్మ, బంతి పూలు విరివిగా సాగు చేస్తూ లాభాల బాటలో పయనిస్తుండడం విశేషం.

– పెళ్లకూరు

- మండలంలో విస్తారంగా ఉద్యాన పంటల సాగు
- నిరంతర సేద్యంతో లాభాల బాటలో రైతాంగం



పచ్చిమిర్చి సాగుపై సూచనలు ఇస్తున్న యువ శాస్త్రవేత్తలు (ఫైల్)

నూతన వ్యవసాయ విధానం

మండల పరిధిలోని చెంబడిపాళెం, దిగువచావాలి, ఎగువచావాలి, తాళ్వాయిపాడు, కానూరు, పెన్నేపల్లి తదితర గ్రామాల్లో ఎక్కువ మంది రైతులు కూరగాయలు, ఆకుకూరలు సాగు చేస్తున్నారు. ఇక్కడి గ్రామాల్లోని రైతులు నూతన వ్యవసాయ విధానం ద్వారా ప్రతి ఏటా సుమారు 1450 ఎకరాలకు పైగా కూరగాయలు, ఆకుకూరలు పండిస్తున్నారు. నదీతీర ప్రాంతం కావడంతోపాటు భూములు సారవంతంగా ఉండడంతో ఆకుకూరలు, కూరగాయలు తోటలు విస్తారంగా సాగు చేస్తున్నారు. ప్రతి ఏటా రైతులంతా కలిసి పంటల ఎంపికపై చర్చించుకొని, వ్యవసాయ అధికారుల సలహాల మేరకు మేలు రకం విత్తనాలను ఎంపిక చేసుకుంటున్నారు. నూతన వంగడాలు, సులభమైన వ్యవసాయ పద్ధతులతో అధిక దిగుబడులు సాధించే ఇక్కడి అన్నదాతలు చుట్టుపక్కల గ్రామాల రైతులకు ఆదర్శంగా నిలుస్తున్నారు. ముఖ్యంగా టమాటా, కాకర, బీర తదితర పంటలను అల్లిక విధానంలో సాగు చేసి నాణ్యమైన దిగుబడులు సాధిస్తున్నారు.

పచ్చిమిర్చితో లాభాలు మెండు

ఒకప్పుడు మెట్ట ప్రాంతాలకే పరిమితమైన పచ్చిమిర్చి సాగు ఇప్పుడు మండలంలోని కానూరు, తాళ్వాయిపాడు, రోసనూరు, చావాలి, చెంబడిపాళెం, దొడ్లవారిమిట్ట, పెన్నేపల్లి తదితర ప్రాంతాల్లో సాగు చేపట్టి నాణ్యమైన అధిక దిగుబడులు సాధిస్తున్నారు. ఉద్యానవ శాఖ అధికారుల సలహాలను పాటిస్తూ ఉత్తర భారతదేశంలో మంచి గిరాకీ ఉన్న మిర్చి రకాలను ఎంపిక చేసుకొని ప్రతి ఏటా సుమారు 3వేల ఎకరాలకు పైగా సాగు చేస్తున్నారు. ఇక్కడ రైతులు పండించే నాణ్యమైన పచ్చిమిర్చిని దేశ రాజధాని ఢిల్లీతో పాటు ఆగ్రా, చెన్నై, బెంగళూరు, విజయవాడ తదితర పట్టణాలకు ఎగుమతులు చేసి మంచి లాభాలు పొందుతున్నారు.

పంట మార్పిడిగా మొక్కజొన్న

ఈ ప్రాంత రైతులు పంటల మార్పిడి విధానంతో మొక్కజొన్న పంటను సాగు చేస్తున్నారు. చెంబడిపాళెం, చావాలి గ్రామాల్లోని రైతులు మొక్కజొన్న పంటపై ఆసక్తితో మేలు రకం విత్తనాలు ఎంపిక చేసుకొని సాగు చేస్తున్నారు. పంట మార్పిడిపై దృష్టి పెట్టి మొక్కజొన్న సాగు విరివిగా చేపడుతున్నారు. ఎక్కువ మంది రైతులు వరి, చెరకు, వేరుశనగ పంటలను సాగు చేయడంతోపాటు మొక్కజొన్న సాగుతో అధిక లాభాలు పొందుతున్నారు. పంట పూతదశలో ఉన్నప్పుడు సమీపంలో రెండోదశగా మొక్కజొన్న విత్తనాలు వేయడం ఇక్కడ రైతుల ప్రత్యేకత. దీంతో తొలిదశ పంట పూర్తికాగానే రెండోదశ పంట ఏపుగా పెరుగుతుంది. పండించిన పంటను నాయుడుపేట, శ్రీకాళహస్తి, తిరుపతి పట్టణాలకు తరలించి మార్కెటింగ్ చేసుకుంటున్నారు. తద్వారా ఇక్కడి రైతులు అధిక లాభాలు పొందుతున్నారు.

అందుబాటులో మొక్కల నర్సరీ



మండలంలోని రైతులందరికీ అందుబాటులో తాళ్వాయిపాడు గ్రామానికి చెందిన కట్టా బాలసుబ్రమణ్యం మొక్కలు నర్సరీ ఉంది. గతంలో చిత్తూరు, పీలేరు, మదనపల్లె, రాజమండ్రి తదితర ప్రాంతాలకు వెళ్లి వంగ, మిరప తదితర మొక్కలను తెచ్చుకొనేవారు. ప్రస్తుతం అందుబాటులో నర్సరీ ఉండడమే కాకుండా కేవలం ఒక్క రూపాయికే ఒక మొక్కను విక్రయించడం విశేషం. ప్రభుత్వం అందించిన ఆర్థిక సాయంతో బాలసుబ్రమణ్యం నర్సరీని ఏర్పాటు చేసి వంగ, బెండ, టమాటా, బంతి, చిక్కుడు, బీర, కాకర పలు రకాల మొక్కలను ట్రే సాగు పద్ధతిలో పెంచి రైతులకు విక్రయిస్తున్నారు. దీంతో ఇక్కడి సామాన్య రైతులు నారు పోసుకోవడానికి ఇబ్బంది లేకుండా తక్కువ ధరపై మొక్కలను తెచ్చుకొని సాగు చేస్తున్నారు.

రైతులకు రాయితీ

మండల వ్యవసాయశాఖ ఆర్బీకేల ద్వారా గతేడాది 916.50క్వింటాళ్ల జీలగలు, 30 క్వింటాళ్ల జనుము, 112 క్వింటాళ్ల పిల్లిపెసర రాయితీపై రైతులకు అందించారు. అలాగే ఈ ఏడాది జీలగలు 625 క్వింటాళ్లు, జనుము 20క్వింటాళ్లు, పిల్లిపెసర 225 క్వింటాళ్లు రాయితీపై అందించారు. అలాగే చిల్లకూరు సహకార సంఘం నుండి యూరియా, డీఏపీ, పొటాష్ తదితర ఎరువులను రూ.48లక్షలకు పైగా రైతులకు విక్రయించారు.

బంతి సాగుతో రైతుకు మేలు

ఆధునిక వ్యవసాయ విధానంలో భాగంగా రైతులు పలు రకాల వ్యవసాయ పద్ధతుల్లో సేద్యం చేసేందుకు మక్కువ చూపుతూ అధిక లాభాలు దిశగా ముందుకు సాగుతున్నారు. ఈ క్రమంలోనే శిరసనంబేడు, రాజుపాళెం, తాళ్వాయిపాడు గ్రామాలకు నిమ్మ తోటల్లో అంతర పంటగా బంతి సాగు చేస్తున్నారు. ఇక్కడి మెట్ట భూముల్లో భూసారం పెంపొందించేందుకు దుక్కి చేసి దానికి వర్మీ కంపోస్టు ఎరువు మొక్కల కుదుళ్లలో వేసి నీరు పెట్టడంతో బంతి మొక్కలు ఆరోగ్యంగా పెరిగి నాణ్యమైన పువ్వులతో తోట కళకళలాడుతుంది. బంతి పంటకు ఆకుముడత తెగులు రాకుండా తేలికపాటి రసాయన మందులను పిచికారి చేస్తూ తెగుళ్ల బారి నుండి రక్షించుకోవడంతో అధిక దిగుబడులు, మంచి లాభాలు గడిస్తున్నారు. సాగు ప్రారంభం నుండి మొత్తం ఒక ఎకరానికి సుమారు రూ.60 వేలు పెట్టుబడి పెట్టినప్పటికీ మంచి లాభాలు వస్తున్నాయి. ప్రస్తుతం పెళ్లిళ్ల సీజన్‌తో బంతిపూలకు డిమాండ్ పెరుగుతుంది.



వంగ, బెండ తోటలలో కలుపు తీస్తున్న రైతు

రోడ్డు పక్కనే విక్రయ కేంద్రాలు

జాతీయ రహదారి మార్గంలో రోడ్డు పక్కనే పలుచోట్ల విక్రయ కేంద్రాలను ఏర్పాటు చేసుకొని వాహనచోదకులకు, ప్రయాణికులకు తాజా కూరగాయలు, ఆకుకూరలను విక్రయిస్తున్నారు. రోడ్డు పక్కన ఉన్న భూముల్లో పండించిన తాజా కూరగాయలను కొనేందుకు అధిక సంఖ్యలో ప్రజలు, ప్రయాణికులు ఆసక్తి చూపుతున్నారు. అయితే కొన్ని సందర్భాల్లో అధికంగా పండించిన మిర్చి, కాకర, బెండ, వంగ, చిక్కుడు తదితర పంటలను తిరుపతి, నాయుడుపేట, శ్రీకాళహస్తి, బెంగళూరు, చెన్నై తదితర పట్టణాలకు తరలించి అమ్ముకుంటున్నారు.

భూసారం పెంచడంలో...

ఇక్కడి రైతులు సాగు భూముల్లో భూసారాన్ని పెంచడంలో వారికివారే సాటి. ఏడాదంతా పంటలు సాగు చేసే ఇక్కడి రైతులు పంటకు పంటకు మధ్య వ్యవధిలో పచ్చిరొట్ట పంటలు జీలగ, జనుము, పిల్లిపెసర తదితర వాటిని వేసి, భూమిలో కలియ దున్నుతారు. అంతేకాకుండా వేరుశనగ పంట అనంతరం ఆకులను పరచడంతోపాటు ఎక్కువగా సేంద్రియ ఎరువులను వాడుతూ భూసారం పెంపొందించడం ఇక్కడి అన్నదాతల నేర్పరితనానికి నిదర్శనం. అలాగే అంతర పంటల సాగుతో భూ సారం దెబ్బ తినకుండా తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నారు.

కంపోస్టు తయారు చేసుకుంటాం



శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారుల సూచనలతో రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించేశాం. ప్రస్తుతం రైతులందరం సేంద్రియ ఎరువులను వినియోగిస్తున్నాం. వర్మీ కంపోస్టు ఎరువులను స్వయంగా తయారు చేసుకుంటాం.

- సీహెచ్ మార్కండేయ, రైతు, చెంబడిపాళెం

మార్కెటింగ్ సౌకర్యం కల్పించాలి



పచ్చిమిర్చి, బెండ, వంగ, కాకర తదితర పంటలను ఎక్కువగా సాగు చేస్తున్నాం. నాయుడుపేట, శ్రీకాళహస్తి, తిరుపతి, చెన్నై, బెంగళూరు పట్టణాలకు తరలించేందుకు కొంత ఇబ్బందులు పడుతున్నాం. అధికారులు స్పందించి మార్కెటింగ్ సదుపాయం కల్పించాలి. **- ఎం ప్రకాష్, రైతు, ఎగువ చావాలి**

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



ఆశా వర్కర్లతో మాట్లాడుతున్న వైద్యాధికారి మోహన్‌రంగా

ఓజిలి: వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారి మోహన్‌రంగా అన్నారు. మండలంలోని అత్తివరం పీహెచ్‌సీలో ఆశా డే కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత వారం రోజుల నుంచి వర్షాలతో దోమలు వ్యాప్తి చెందకుండా మలాథియాన్ పిచికారీ చేయించాలన్నారు. మలేరియా, డెంగీ, వైరల్ ఫీవర్, ఇతర జ్వరాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. ఇంటింటికి తిరిగి జ్వరాలపై సర్వే చేయాలన్నారు. జ్వర పీడితులు ఉంటే పీహెచ్‌సీకు తరలించి వైద్య సేవలందించాలని తెలిపారు. రక్తహీనత ఉన్న గర్భిణీలపై దృష్టి సారించి మెరుగైన వైద్యం అందేలా చర్యలు చేపట్టాలన్నారు. ప్రభుత్వ వైద్యశాలల్లో కాన్పుల సంఖ్యను పెంచాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది రాజగోపాల్, సుభాషిణి, జయసూర్య, ఏఎన్ఎం కుసుమకుమారి, జ్యోతి, గీతా, ఎంపీహెచ్ఏఎస్ మల్లీశ్వరీ తదితరులు పాల్గొన్నారు.

ఏపీఈసెట్‌లో గూడూరు విద్యార్థి ప్రతిభ



దివ్య పూర్ణచంద్

గూడూరు రూరల్: పట్టణానికి చెందిన ఓ విద్యార్థి ఇంటర్ తరువాత ఏపీఈసెట్ పరీక్ష రాసి, ప్రతిభ కనబరిచాడు. మున్సిపల్ కార్యాలయంలో ఔట్ సోర్సింగ్‌లో పని చేస్తున్న పేటేటి నాగకోటేశ్వరరావు కుమారుడు దివ్య పూర్ణ చంద్ ఏపీఈసెట్ పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి 233వ ర్యాంకు సాధించాడు. ఈ విద్యార్థి ఇటీవల విడుదలైన జేఈఈ ఫలితాల్లో సత్తా చాటి ఆలిండియా ఈడబ్ల్యూఎస్ విభాగంలో 98వ ర్యాంకు సాధించాడు.

అభివృద్ధి పనులకు ఏకగ్రీవ తీర్మానం



మాట్లాడుతున్న చైర్ పర్సన్ దీపిక, కమిషనర్ జనార్దన్‌రెడ్డి తదితరులు

నాయుడుపేట టౌన్: నాయుడుపేట మున్సిపాలిటీకి సంబంధించి జరిగే పలు అభివృద్ధి పనులకు కౌన్సిల్ సభ్యులు ఏకగ్రీవంగా తీర్మానిస్తూ ఆమోదం తెలిపారు. మున్సిపల్ కార్యాలయ సమావేశ మందిరంలో మంగళవారం చైర్ పర్సన్ కటకం దీపిక అధ్యక్షతన కమిషనర్ జనార్దన్‌రెడ్డి కౌన్సిల్ సమావేశం జరిపారు. ముందుగా అజెండాలో రూపొందించిన 6 అంశాలతో పాటు టేబుల్ అజెండాను చదివి కౌన్సిలర్‌లకు వివరించారు.. ఇంకా మున్సిపాలిటీ పరిధిలోని పలు ప్రాంతాల్లో అభివృద్ధి పనులు చేస్తున్నట్లు కమిషనర్ వివరించారు. మున్సిపాలిటీకి సంబంధించి మూడు నెలల కిందట జరిపిన వేలం పాటలో దక్కించుకున్న కూరగాయల మార్కెట్, మాంసం మార్కెట్‌లకు సంబంధించి లక్షలాది రూపాయల నగదు ఇంతవరకు వసూలు చేయక పోవడంపై వైస్ చైర్మన్ వెంకట కృష్ణారెడ్డి ప్రశ్నించారు. కమిషనర్ మాట్లాడుతూ రికార్డులను పరిశీలించి చెబుతామన్నారు. ఈ సమావే శంలో మున్సిపల్ మేనేజర్ ఎంకే ఖాజామొహిద్దిన్, ఆర్ఐ షాజహాన్, కౌన్సిలర్లు దారా రవి, పాపాడి చంద్రారెడ్డి, షేక్ షబ్బీర్, కె.అశోక్‌కుమార్, ఆర్.సరిత, ఎస్.శాంతి, చిందేటి విజయలక్ష్మి, ఎ.మస్తానమ్మ తదితరులు పాల్గొన్నారు.

వర్షాలకు పల్లె వీధులు ఛిద్రం



తల్లంపాడులో కొత్తగా ఏర్పాటైన కాలనీలో ఓ వీధి దుస్థితి

దొరవారిసత్రం: నైరుతి రుతుపవనాల మొదలైనప్పటి నుంచి దొరవారిసత్రం మండలం పరిధిలోని పలు గ్రామాల్లో ఓ మోస్తరు వర్షం అడపాదడపా కురుస్తూనే ఉంది. దీంతో పలు గ్రామాల్లో వీధులు రొచ్చు రొచ్చుగా మారడంతో పాదచారులు వీధుల్లో నడవలేక నానాఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికే కురిసిన వానలకు తల్లంపాడు, మోదుగులపాళెం, బురదమడుగు, కరటామిడి, కొత్తపల్లి, తనియాలి, వేణుంబాకం, శ్రీధనమల్లి, కట్టువాపల్లి తదితర గ్రామాల్లోని ఎస్సీ, ఎస్టీ కాలనీల్లోని వీధులు దారుణంగా దర్శనమిస్తున్నాయి. ఆయా ప్రాంతాల్లోని పంచాయతీ పాలకులు స్పందించి కనీసం వీధులకు మరమ్మతులకు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రభుత్వ కార్యాలయాలకు విద్యుద్దీపాలంకరణ

వాకాడు: ఈ నెల 12న నారా చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేస్తున్న సందర్భంగా మంగళవారం మండలంలోని ప్రభుత్వ కార్యాలయాలను పుసుపు విద్యుత్ దీపాలతో అలంకరించారు. వాకాడు ఎంపీడీఓ కార్యాలయంతోపాటు గ్రామ సచివాలయాలు విద్యుత్ లైట్లతో పసుపు మయంగా దర్శనమిచ్చాయి.

ముగ్గురి అరెస్ట్

కోట: చోరీలకు పాల్పడుతున్న ముగ్గురిని అరెస్ట్ చేసి వారి నుంచి చోరీ సొత్తు రికవరీ చేసినట్లు ఎస్ఐ నాగబాబు తెలిపారు. ఎస్ఐ కథనం.. వాకాడు మండలం, కొండూరుపాళెంకు చెందిన దస్తాది చిరు, కోటకు చెందిన బందిల శ్రీను, సూళ్లూరుపేటకు చెందిన దిలీప్ ముఠాగా ఏర్పడి చోరీలకు పాల్పడుతున్నారు. కొన్ని నెలలుగా కోట, వాకాడు, నాయుడుపేట పోలీస్‌స్టేషన్ల పరిధిలో పలు చోరీలకు పాల్పడ్డారు. ఈ క్రమంలో చిట్టేడు వద్ద ప్రధాన రహదారిపై అరెస్ట్ చేసి వారి నుంచి 107 గ్రాముల బంగారు, 243 గ్రాముల వెండి, మోటార్ బైక్‌ను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ముత్యాలమ్మకు పల్లకీ సేవ



ముత్యాలమ్మకు పల్లకీ సేవ

చిల్లకూరు: తూర్పుకనుపూరులో వెలసిన ముత్యాలమ్మ ఆలయంలో మంగళవారం అమ్మవారికి పల్లకీ సేవ నిర్వహించారు. అమ్మవారికి ఉదయం సుప్రభాత సేవ నిర్వహించిన అనంతరం పలు రకాల అభిషేకాలు చేపట్టారు. అనంతరం అమ్మవారి మూల విరాట్‌కు ప్రత్యేక అలంకరణ చేశారు. సాయంత్రం అమ్మవారికి పల్లకీ సేవ నిర్వహించి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. అలాగే అమ్మవారికి ఊంజల్ సేవ చేపట్టారు. ఈ కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయ ఈఓ నవీన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నీటి నిల్వలు పెంచేందుకు దోహదం



ఉపాధి పనులను పరిశీలిస్తున్న ఏపీఓ గిరిబాబు

చిల్లకూరు: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద చెరువుల్లో చేపడుతున్న కమ్యూనిటీ పాండ్ పనులతో భవిష్యత్తులో నీటి నిల్వలు ఎక్కువగా ఉండేందుకు దోహదపడుతాయని ఏపీఓ గిరిబాబు తెలిపారు. మండలంలోని బూదనం గ్రామ చెరువులో జరుగుతున్న కమ్యూనిటీ పాండ్ పనులను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఉపాధి కూలీలతో మాట్లాడుతూ వర్షం కురిసి నేల తడిగా ఉందని దీనిని దృష్టిలో ఉంచుకుని ప్రతి ఒక్కరు తమకు ప్రభుత్వం అందించే కూలీ మొత్తానికి పని చేయవచ్చని అన్నారు. అలాగే కూలీలు చేసిన పనిని కూడా వెంటనే క్షేత్ర సహాయకులు, టెక్నికల్ అసిస్టెంట్ల ద్వారా కొలతలు వేయించి కూలీలకు ఇబ్బంది లేకుండా చూసుకోవాలని అన్నారు. తవ్విన తరువాత వర్షం వస్తే కూలీలు చేసిన పని కొలతల్లో తేడా వస్తే కూలీలు నష్టపోతారని దీంతోనే త్వరగా కొలతలు వేయించాలని అన్నారు.

పెరిగిన కూరగాయల ధరలు



మార్కెట్లో కూరగాయలు



కూరగాయల దుకాణంలో అల్లం

మార్కెట్‌లో ఉన్న కూరగాయల ధరలు	కేజీ
బీరకాయలు	రూ.100
పచ్చి మిరప	రూ.80
బెండకాయలు	రూ.80
బీన్స్	రూ.150
చిక్కుడు కాయలు	రూ.120
క్యారెట్	రూ.80
బీట్‌రూట్	రూ.60
వంకాయలు	రూ.60
అల్లం	రూ.200
చికెన్	రూ.300
కోడిగుడ్లు (డజను)	రూ.80

కోట: కూరగాయలు కొనేందుకు మార్కెట్‌కు వచ్చిన జనం రేట్లు చూసి బెంబేలెత్తిపోతున్నారు. ధరలు మండిపోతున్నాయంటూ ఉన్నంతలో సర్దుకుని కొనుగోలు చేస్తున్నారు.వేసవిలో రైతులు కూరగాయలు సాగు చేయడం తగ్గింది. దీంతో పాటు వ్యాపారులు ఇతర ప్రాంతాల నుంచి కూరగాయలను దిగుమతి చేసుకోవాల్సి రావడంతో అమాంతంగా ధరలు పెరగడానికి కారణంగా చెబుతున్నారు. టమాట దగ్గర నుంచి మిర్చి, బీర, బెండ కాయలు, బీట్‌రూట్, వంకాయ, క్యారెట్ ఇలా ఏది కొనాలన్నా కేజీ రూ.60 నుంచి రూ.120 వరకు ధర పలుకుతున్నాయి. ఆకుకూరలు, కొత్తిమీర కట్ట రూ.20 నుంచి రూ.50 వరకు చెబుతున్నారని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అల్లం కొనుగోలు చేయాలంటే ప్రస్తుతం భయపడాల్సిన పరిస్థితి ఉంది. గతంలో ఎప్పుడూ లేని విధంగా కిలో అల్లం ధర రూ.200 పలుకుతుంది. సామాన్యుడు కనీసం అల్లం కొనాలంటే కూడా ఆలోచించాల్సిన పరిస్థితి నెలకొంది.

అనారోగ్యంతో ఉన్న విద్యార్థికి ఆర్థిక సాయం

తడ: అనారోగ్యంతో ఇటీవల ఆసుపత్రిలో ఆపరేషన్ చేయించుకుని ఇంటి వద్ద ఉన్న విద్యార్థికి తడ యూటీఎఫ్ శాఖ మంగళవారం 25 వేల రూపాయల ఆర్థిక సాయం చేసింది. చిన్నమాంబట్టు ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న మాంబట్టు పంచాయతీ, ఎన్ఎం కండ్రిగ గ్రామానికి చెందిన యనమల చరణ్‌కు అపెండిసైటిస్ ఆపరేషన్ చేశారు. చరణ్ తండ్రికి కూడా ఇటీవల అనారోగ్యానికి గురై ఆపరేషన్ చేయించుకున్నాడు. వారి కుటుంబం ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయం తెలుసుకున్న యూటీఎఫ్ ఉపాధ్యాయులు తలా కొంత అందించడంతో దానిని బాధిత కుటుంబానికి అందజేశారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు జీజే రాజశేఖర్, జిల్లా ఆడిట్ కమిటీ సభ్యులు ఎస్.బాబు, మండల అధ్యక్షుడు కేటీ నవీన్‌కుమార్, మండల కార్యవర్గ సభ్యులు కె.సుధాకర్ పాల్గొన్నారు.